న్యూస్‌రీల్

'మన ఊరు-మనబడి' పనుల పరిశీలన


దండేపల్లి: పనులపై హెచ్‌ఎం శ్రీలతకు సూచనలిస్తున్న సఫ్దర్ అలీఖాన్

దండేపల్లి/జన్నారం: 'మనఊరు-మనబడి' పైలెట్ ప్రాజెక్ట్‌లో ఎంపికైన దండేపల్లి మండలం పెద్దపేట పాఠశాలను, జన్నారం మండలం పొనకల్, చింతలపల్లి పాఠశాలలను జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి సఫ్దర్ అలీఖాన్ బుధవారం సందర్శించారు. పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం 'తొలిమెట్టు' కార్యక్రమంపై మూడో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో సీఆర్పీ ఇప్ప సురేందర్, పెద్దపేట పాఠశాల హెచ్‌ఎం శ్రీలత, జన్నారం ఎంఈవో విజయ్‌కుమార్ ఉన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు పోషక కిట్లు


కిట్లను అందిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని టీబీ వ్యాధిగ్రస్తులకు నెల రోజులకు సరిపడా 7రకాల అధిక పోషక పదార్థాల కిట్లను రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనీష్, డాక్టర్ అన్సర్, సాయిరెడ్డి, నాగభూషణం, రెడ్‌క్రాస్ చైర్మన్ కె.భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ మహేందర్, వి.మధుసూదన్ రెడ్డి, కె.సత్యపాల్ రెడ్డి, ఎస్.నాగేందర్, ఎం.చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన


మాట్లాడుతున్న ఎంవీఐ రాహుల్‌కుమార్

జన్నారం: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎంవీఐ రాహుల్‌కుమార్ సూచించారు. ఈ నెల 11నుంచి 17వరకు రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా మండలకేంద్రంలోని ఆటో, జీపు డ్రైవర్లకు, యజమానులకు బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి సంబంధించిన అన్ని రకాల కాగితాలు కలిగి ఉండాలని సూచించారు. వాహనాన్ని మితిమీరిన వేగంతో నడుపొద్దని హితవు పలికారు.

'రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి'

నస్పూర్: మున్నూరు కాపు కులస్తులు అందరూ ఐక్యంగా ఉండి రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం పిలుపునిచ్చారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మండల స్థాయి మున్నూరు కాపు కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారాం మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు శివపతి సురేశ్ కుమార్‌తో కలిసి 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్నూరు కాపులు మరింత బలోపేతం కావాలన్నారు.

వాజ్‌పేయి స్మారక క్రికెట్ కప్ విజేతగా ముల్కల్ల


ట్రోఫీ అందుకుంటున్న ముల్కల్ల జట్టు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలో నాలుగు రోజులుగా రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ సహకారంతో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారక క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు జరిగిన క్రికెట్ ఫైనల్ పోరులో మండలంలోని ముల్కల్ల, టీకానపల్లి గ్రామాల జట్లు పోటీపడగా ముల్కల్ల జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ట్రోఫీతో పాటు రూ.10వేల నగదును బహుమతిగా అందజేశారు. రన్నరప్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.5వేలు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ముల్కల్ల జట్టుకు చెందిన వెంకటేశ్‌కు అందజేశారు. బీజేపీ నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, మోటపలుకుల తిరుపతి, వెంకటరమణారావు, ఆరెందు రాజేశ్, కోట సాయినవీన్, చౌతకారి రాకేశ్, బోయిని నరేశ్ పాల్గొన్నారు.


బయటి నుంచి నీళ్లు తెప్పించి పోస్తున్న దృశ్యం

ఈ దాహం తీరనిది!

- 'ఆదర్శ' విద్యార్థులకు నీటి కష్టాలు!
- తరచూ మొరాయిస్తున్న మోటార్
- వారం రోజులుగా నిలిచిన రన్నింగ్ వాటర్ సరఫరా
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- ఇళ్ల నుంచే తీసుకెళ్తున్న వైనం..

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. వారం క్రితం రన్నింగ్ వాటర్ సరఫరాకు సంబంధించిన మోటా రు పాడైపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. బయటి నుంచి డ్రమ్ములల్లో నీళ్లు తెప్పించి పోస్తున్నారు.

- ఆదర్శపాఠశాలను 2014లో లింగాపూర్‌లో నిర్మించిన పక్కా భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు 700మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల అవసరాల కోసం 2015లో పాఠశాలకు కిలోమీటరు దూరంలో రూ.6లక్షలతో ఓపెన్‌వెల్ నిర్మించి పైప్‌లైన్ వేశారు. పాఠశాలకు బావి దూరం ఉండటంతో పాటు మోటారు తరచూ మరమ్మతులకు గురికావడంతో నీటిసరఫరాకు అంతరాయం కలుగుతోంది. నీటి సరఫరా నిలిచి పోయినప్పుడల్లా విద్యార్థులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. నీటి సరఫరా నిలిచిపోవడంతో, గ్రామస్తుల సహకారంతో బయటి నుంచి నీళ్లు తెప్పించి డ్రమ్ములలో నిల్వచేస్తున్నారు. వీటిని విద్యార్థులు బయటి అవసరాలకు వినియోగించుకుంటున్నారు.

తాగునీటి సౌకర్యం అంతంతే..

పాఠశాల విద్యార్థులకు తాగునీటి సౌకర్యం లేనందునా పాఠశాల పనిదినాల్లో వాటర్‌ప్లాంట్ నుంచి మినరల్ వాటర్ తెప్పించి పోస్తున్నారు. పరిస్థితి గమనించిన కొందరు విద్యార్థులు బాటిళ్లలో ఇళ్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. తాగునీటి కోసం నెలకు సుమారుగా రూ.15వేల వరకు ఖర్చు అవుతుందని ప్రిన్సిపాల్ అనీలా తెలిపారు. డ్రింకింగ్ వాటర్ కోసం పాఠశాల గ్రాంట్స్‌ను ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో మిషన్ భగీరథ ట్యాంకు ఉండగా ఒకటే ట్యాప్ కనెక్షన్ ఇచ్చినట్లు తెలిపారు. వందల సంఖ్యలో ఉన్న విద్యార్థులకు ఒక్క ట్యాప్ సరిపోవడం లేదని వాపోయారు. ట్యాప్ కనెక్షన్ కాకుండా ట్యాంకు నుంచి పాఠశాల నీటి ట్యాంకులకు డైరెక్ట్ కనెక్షన్ ఇవ్వాలని పాఠశాల సిబ్బంది కోరుతున్నారు.

ఇబ్బంది అవుతోంది..



పాఠశాలలో రన్నింగ్ వాటర్ సరఫరాలో తరచూ సమస్య ఏర్పడటంతో ఇబ్బంది అవుతుంది. నీటి సరఫరా నిలిచి పోయినప్పుడల్లా బయటి నుంచి తెప్పించి పోస్తున్నారు. టాయిలెట్లలో నీటి సరఫరా లేక, బయట డ్రమ్ముల్లో నిల్వ చేసిన నీళ్లను వినియోగించాల్సి వస్తుంది. నీటి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– అంజలి, ఇంటర్ విద్యార్థిని

బాటిళ్లలో తెచ్చుకుంటున్నాం



పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేదు. రోజూ మినరల్ వాటర్ తెప్పించి, డ్రమ్ములలో నిల్వచేస్తున్నారు. వాటిని పట్టుకుంటున్నాం. దీంతో తాగునీటి ఇక్కట్లను గమనించి ఇంటి నుంచి బాటిళ్లలో నీళ్లు తెచ్చుకుంటున్నాం. తాగునీటికి ప్రత్యేక సౌకర్యం కల్పించాలి.

– ప్రణీత్, విద్యార్థి, 7వ తరగతి

అధికారుల దృష్టికి తీసుకెళ్లా..



పాఠశాలలో నీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. పాఠశాల ఆవరణలో గల భగీరథ ట్యాంకు నుంచి డైరెక్టు నీటి సరఫరా కోసం గేట్ వాల్వ్ ఏర్పాటు చేశారు, కానీ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో తాగునీటి కోసం ప్రతి రోజు మినరల్‌వాటర్ తెప్పిస్తున్నాం. రన్నింగ్ వాటర్ మోటారు పాడైపోవడంతో బయటి నుంచి తెప్పిస్తున్నాం.

– అనీలా, ప్రిన్సిపాల్

మున్సిపల్ కార్మికులకు సబ్బులు, నూనె


కార్మికులకు సబ్బులు, నూనె అందిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్మికులకు బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు చేతుల మీదుగా 350మందికి సబ్బులు, నూనె అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని, సంక్రాంతి పండుగకు కార్మికులకు అవసరమైన సరుకులను అందించాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజయ్య, కమిషనర్ ఎస్.బాలకృష్ణ, కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, కౌన్సిలర్లు మాదం శెట్టి సత్యనారాయణ, పోరేటి రాజు, సాయి భార్గవి, మెరుగు మహేశ్వరి, నాయకులు తాజొద్దీన్, రవీందర్‌రావు, బొలిశెట్టి కిషన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పాఠశాలకు విరాళం

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కి బాసర ఐఐఐటీ, పూర్వ విద్యార్థులు రశ్మి మయూర్ రూ.65వేలు, హాజీపూర్ ఎస్సై ఉదయ్‌కిరణ్, కెనరా బ్యాంకు మేనేజర్ వెంకటేష్ తదితరులు కలిసి రూ.50వేలు పాఠశాలకు విరాళం అందించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ జయకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రశ్మి మయూర్ అందించిన రూ.65వేలు విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు రెండు ఇండస్ట్రీయల్ సేవింగ్ మిషన్స్, దానికి సంబంధించిన మెటీరియల్ కొనుగోలు చేసామని, ఉదయ్‌కిరణ్, వెంకటేష్ తదితరులు అందించిన రూ.50వేలు ఆన్‌లైన్ టీచింగ్ హబ్ ఏర్పాటు చేస్తామని ప్రిన్సిపల్ తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

వేమనపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మయ్య అధ్యక్షతన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీల్లో ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచాలని, మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

డ్రెయినేజీ పనులకు భూమిపూజ

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి 11వార్డులో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.లక్ష అంచనాతో నిర్మించే సీసీ డ్రెయినేజీకి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత బుధవారం భూమిపూజ చేసి ప్రారంభించారు.

అలరించిన రెయిన్‌బో స్పోర్ట్స్ డే

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో బుధవారం సీసీసీలోని రెయిన్‌బో ప్లే స్కూల్ యాజమాన్యం స్పోర్ట్స్ డేను నిర్వహించింది. విద్యార్థులంతా ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలైన పిల్లలకు బహుమతి ప్రదానం చేశారు.

బడి బయట పిల్లల సర్వే

భీమిని: కన్నెపల్లి మండలంలోని రెబ్బెన గ్రామపంచాయతీలో బుధవారం బడిబయట ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే నిర్వహించారు. 6నుంచి 14సంవత్సరాలు ఉండి బడి మానేసిన పిల్లలందరూ బడిలో చేరాలని 15నుంచి 19సంవత్సరాల పిల్లలందరూ ఓపెన్‌స్కూల్‌లో చేరాలని సూచించారు.

స్థలం కబ్జా కాకుండా చూడాలని వినతి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో గల శ్రీలక్ష్మి లేఔట్‌లోని 62గుంటల స్థలాన్ని కబ్జా కాకుండా కాపాడాలని కోరుతూ శ్రీలక్ష్మీనగర్ కాలనీకి చెందిన కాలనీవాసులు బుధవారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కమిషనర్ ఎస్.బాలకృష్ణలకు వినతిపత్రం అందించారు.

క్రీడాప్రాంగణాలకు స్థలాల గుర్తింపు

జైపూర్: మండలంలోని కుందారం, శివ్వారం గ్రామాల్లో తెలంగాణ క్రీడాప్రాంగణాలకు బుధవారం తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ స్థలాలు గుర్తించి కేటాయించారు.

పోషణ్ అభియాన్‌పై అవగాహన


మాట్లాడుతున్న సీడీపీవో స్వరూపరాణి

మందమర్రిరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం పోషణ్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీడీపీవో స్వరూపరాణి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ, అభివృద్ధి అభ్యాసనపై అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. పోషణ్ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ సతీష్ ఐఎల్‌ఏ ట్రెనింగ్‌లో భాగంగా మాడ్యూల్స్ 11, 12, 13, 14పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్, చందన, ప్రసన్న, రమాదేవి, సంధ్యారాణి, స్వప్న తదితరులు ఉన్నారు.

అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలి

పాతమంచిర్యాల: గిరిజన ఆశ్రమపాఠశాలలు, హాస్టళ్లలో పని చేస్తున్న వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఖమ్మంలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న వర్కర్లను, నాయకులను పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ ఒక ప్రకటనలో అన్నారు. అరెస్టులు చేయడం కార్మిక వ్యతిరేఖ చర్యలకు నిదర్శనమని విమర్శించారు. అరెస్టు చేసిన నాయకులను, వర్కర్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కనుల పండువగా గోదాదేవి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న పండితులు

జన్నారం: మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం కనుల పండువగా జరిగింది. ప్రముఖ వ్యాపారి జక్కు సత్తయ్య, భాగ్యలక్ష్మి, హరిదాసు దంపతులు వివాహాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి ఆశీర్వచనాలు పొందారు. పొనకల్ వాసి కిషన్ దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, వీడీసీ అధ్యక్షుడు అంజి, సభ్యులు భూమాచారి, భక్తులు పాల్గొన్నారు.

సింగరేణి విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యాబోధన

- శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి


బహుమతులు ప్రదానం చేస్తున్న జీఎం దంపతులు

శ్రీరాంపూర్: సింగరేణి విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాల 45వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జీఎంతో పాటు ఆయన సతీమణి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి హాజరయ్యారు. సింగరేణి పాఠశాలలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి కంపెనీకి పేరుతేవాలన్నారు. ఈ సందర్భంగా టెన్త్‌లో అధిక మార్కులు సాధించిన ఉత్తమ విద్యార్థులకు, ఆటల్లో విజేతలకు జీఎం దంపతుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటూజీఎం త్యాగరాజు, కరస్పాండెంట్ రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రావులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణా పెంచాలి

శ్రీరాంపూర్: నూతన సీహెచ్‌పీ నుంచి బొగ్గు రవాణా పెంచాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో బుధవారం ఆయన ఉద్యోగులకు సర్వీస్డ్ లింక్ ప్రమోషను అందించారు. రక్షణతో కూడిన బొగ్గు రవాణా ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటూజీఎం త్యాగరాజు, ఏజీఎం(ఈ అండ్‌ఎం) రమేశ్‌బాబు, సీహెచ్‌పీ డీజీఎం డీవీ రావు, టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఇంజనీర్లు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగాల రాత పరీక్షకు శిక్షణ

శ్రీరాంపూర్: ఇటీవల జరిగిన పోలీస్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఫిజికల్ టెస్టులో ఉత్తీర్ణత సాధించి మెయిన్స్ రాత పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు కంపెనీ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జీఎం సంజీవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి ఫిజికల్ టెస్టు ఉత్తీర్ణత పత్రాలను తీసుకొని ఈ నెల 14లోగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలంలోని పర్సనల్ డిపార్టుమెంట్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న అధికారులు, ఉద్యోగులు

జైపూర్: స్థానిక సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో బుధవారం సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర 2023క్యాలెండర్ ఆవిష్కరించారు. ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్, జీఎం డీవీఎస్ సూర్యనారాయణరాజుతో కలిసి గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దరావత్ పంతులా నాయక్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ సీటీసీ ప్రభాకర్‌రావు, ఎస్టీపీపీ లైజన్ అధికారి భీమా, ఏజీఎంలు సుధాకర్, శ్రీనివాసులు, డీజీఎంలు శివప్రసాద్, వేణుగోపాల్, శ్రీనివాస్, మధుసూదన్, రాజేశ్, సీఎంవోఏఐ సెంట్రల్ ఉపాధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ నారాయణరావు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు చుక్కల శ్రీనివాస్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

సీఎంఓఏఐ ఉపాధ్యక్షుడికి సన్మానం

శ్రీరాంపూర్: కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) సీనియర్ ఉపాధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన ఆర్కే5 గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డిని బుధవారం గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ నేతలు, బీఎంఎస్ నేతలు ఘనంగా సన్మానించారు. టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షులు అన్నయ్య, మంద మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్ రెడ్డి, బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెండ్లి మోహన్‌రెడ్డి, కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు



వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు


భోగి మంటలకు సిద్ధం చేసిన ఉపాధ్యాయులు


బెల్లంపల్లి: హరిదాసు వేషధారణలో చిన్నారి

బెల్లంపల్లి: బెల్లంపల్లి లోని శ్రీరామ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి పర్వదిన వేడుకలు కనుల పండువగా జరిగాయి. విద్యాసంస్థలకు ప్రభుత్వం 13వ తేదీ నుంచి సంక్రాంతి వేడుకలు ప్రకటించడంతో శ్రీరామ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు హరిదాసులు, రైతుల వేషధారణతో వచ్చి అలరించారు. చిన్నారులు కేరింతలు కొడుతూ గాలి పటాలను ఎగురవేసి సంతోషంగా గడిపారు. సంక్రాంతి బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉపాధ్యాయులు భోగి మంటలు చేసి తరాల నుంచి వస్తున్న సంప్రదాయాన్ని చిన్నారులకు గుర్తు చేసి అవగాహన కల్పించారు. సంక్రాంతి పిండి వంటలను, పాలతో ప్రత్యేకంగా నైవేద్యాన్ని చేశారు. కార్యక్రమంలో శ్రీరామ ఉన్నత పాఠశాల చైర్మన్ ఎం.శ్రీధర్, డైరెక్టర్ ఎం.శ్రీవిద్య, డీజీఎం లక్ష్మణ్ రావు, ఆర్.ఐ రాజు, జోనల్ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు సంజీవ్, డీన్ రవికుమార్, ప్రైమరీ ఇన్‌చార్జి వరలక్ష్మి, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి పల్లవి, పీఈటీ రాంబాబు, ఏఓ వెంకటేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో..

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. బసవన్నలు, హరిదాసులు, రైతులు తదితర విద్యార్థుల వేషధారణాలు ఆకట్టుకున్నాయి. వివిధ రకాల పిండివంటలు తయారుచేసి ప్రదర్శనగా ఉంచారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జోబిన్, డీన్ గజానంద్, ఏవో విలాస్, పీటీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోండి


లక్సెట్టిపేట: మాట్లాడుతున్న చైర్మన్ కాంతయ్య


భీమారం: మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

భీమారం/లక్సెట్టిపేట/వేమనపల్లి/దండేపల్లి/చెన్నూర్‌రూరల్: ఈ నెల 18 నుంచి చేపట్టే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పలువురు అధికారులు సూచించారు. జిల్లాలోని పలు మండలాల్లో 'కంటి వెలుగు'పై బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి విజయవంతం చేయడానికి అధికారులు కృషి చేయాలన్నారు. వైద్య సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించారు. ఆయా కార్యక్రమాల్లో లక్సెట్టిపేటలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మేనేజర్ శ్రీహరి, జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య, ఎంపీపీ అన్నం మంగ, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, వార్డు కౌన్సి లర్లు పాల్గొనగా, భీమారంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ వాసంతి, జెడ్పీటీసీ బుక్యా తిరుమల పాల్గొన్నారు. దండేపల్లిలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేశం, ఎంపీవో సత్యనారాయణ, వేమనపల్లిలో ఎంపీపీ కోలి స్వర్ణలత, జెడ్పీటీసీ ఆర్.స్వర్ణలత, ఎంపీటీసీలు సంతోష్‌కుమార్, బాపు, ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో బాపురావు, వైద్యాధికారి కృష్ణ, ఏపీఓ సత్యప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు జాహెద్‌అలీ పాల్గొన్నారు. చెన్నూర్ రూరల్‌లో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఎంపీడీవో టి.శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్ అలీ, హెచ్‌ఈవో జగదీశ్, వైద్య సిబ్బంది, స ర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కుడారై ఉత్సవాలు


మంచిర్యాలఅర్బన్: పూజల్లో పాల్గొన్న భక్తులు

భీమారం/మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని విశ్వనాథస్వామి దేవస్థానంలో, గౌతమినగర్ కోదండరామాలయంలో, భీమారం మండలంలోని శ్రీ కోదండ రామాలయంలో ధనుర్మాసం సందర్భంగా బుధవారం కుడారై ఉత్సవాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పాయసాలు సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు భట్టాచార్యులు, తిర్నహరి ప్రవీణ్, చైర్మన్ సిరిపురం రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.


భీమారంలో కుడారై ఉత్సవంలో పాల్గొన్న మహిళలు